

కథ 2003

14

# బా

## రహమతుల్లా

ఆడోళ్ల ఏడుపు, కేకల మధ్య మగాళ్లంతా పెద్దగా 'అల్లాహో అక్బర్' అంటూ ఉంటే జనాజాను ఎత్తుకున్నాం. ముందు మా అన్నయ్యా, నేనూ, వెనుక మా తమ్ముడూ, మా అబ్బాయీ భుజాల మీద పెట్టుకుని ఇంట్లోంచి బయటకు తెస్తున్నాం.

'మట్టి' కొరకు వచ్చిన బంధువులు, మా ఊరి సాయిబులు అందరూ అక్కడే ఉన్నారు. మా 'బా' దోస్తు నీలిశెట్టి వెంకటేశ్వర్లు అప్పుడే వచ్చాడు చూడటానికి.

ఆయనను చూసి, "అరెరె! ఇప్పుడే మొఖాన్ని కప్పి బట్ట కట్టేశారు. మస్జిదుకు పదండి. అక్కడ చూద్దురు గాని," అన్నారు ఎవరో.

క్షణాల్లో భుజాలు మార్చుకుంటూ ఐదు నిమిషాల్లో జనాజాను మస్జిదులోకి చేర్చాం. నా చెల్లెలి భర్త 'జనాజా నమాజు' చదివాడు.

మొఖం మీది కఫన్ తొలగించి, "ఇంకెవరన్నా చూడాల్సిన వాళ్లుంటే జల్దీ చూడండి," అన్నారెవరో. మస్జిదు మెట్ల దగ్గర నిలబడ్డ నీలిశెట్టి జనాజా దగ్గరగా వచ్చాడు. ఆయన కండ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

"చూడు షావుకారు కండ్లలో నీళ్లు ఎట్ల తిరుగుతున్నాయో. పెద్ద కులపాయన. డబ్బున్న మనిషి. అయినా మస్జిదులోకి వచ్చి జంగ్లీని చూసిపోతున్నాడు. ఆత్మీయ సంబంధాల ముందు ఏ షైతాను భావాలు నిలవ్వు," అంటున్నాడో కుర్రోడు.

మా బాను ఊర్లో వాళ్లు జంగ్లీ అని పిలుస్తారు. అందుకు ఒక కథ ఉంది.

మా దాదీ ఆగమ్మకు నొప్పులొచ్చినప్పుడు బండ్లో ఒంగోలు ఆసుపత్రికి బయలుదేరారు. దారి మధ్యలో పేర్నమిట్టకు చేరేసరికి అలవికాని నొప్పులయ్యాయి. బండి ఆపి ఆ మిట్ట కింద జంగల్‌లాంటి చెట్లలో మా దాదీను పడుకోబెట్టారు. కాన్పయింది. జంగల్లో పుట్టిండు గాబట్టి జంగ్లీ అనే పేరు ఖాయమైపోయింది. ఆయన అసలు పేరు షేక్ అబ్దుల్ గఫూరు. చాలా కాలం దాకా నాక్కూడా ఆ పేరు తెలియకపోయేది.

'ఎవరబ్బాయిరా?' అనడిగితే, 'జంగ్లీ కొడుకులం,' అని చెప్పేవాళ్లం మా అన్నదమ్ములం.

మా బా పేరే కాదు ఎద్దుబండి తోలే బా దోస్తుల పేర్లన్నీ అలానే ఉండేవి. క్యా ఫాయిదా, గలాట, బుడ్డ, చౌటోడు, ఫాటిఫిలిం, టపాల్, అంగార్ కాడి, హట్టు బుడా, బుడ్డ మౌళి... ఇలా.

వీళ్లంతా మా చిన్నప్పటి నుంచి మా ఇంటికి రోజు వస్తూనే ఉంటారు. అయినా వారి అసలు పేర్లు నాకు ఈనాటికీ తెలవ్వు. పుట్టిన తేదీలు, పేర్లు సరిగ్గా తెలియనివాళ్లే అంతా. వాళ్లనే ఏముంది మా పూర్వులు ఎవరికీ చదవటం, రాయటం రాదు. మా ఊర్లోని ఏ సాయిబుల ఖాందాన్ తీసుకున్నా చదువు లేనివాళ్లే.

అందుకే బాతో షాదీ అయిననాటి నుంచే రోజుకో సారన్నా మా అంటుండేది- "మాల మాదిగల పిలకాయలు కూడా చదువుతున్నారు... సాయెబుల పిలకాయలకే చదువులేనిది. మన పిల్లలనన్నా చదివించాలి," అని.

బాకు అవి ఎద్దు మెడలో తుంటలా తగులుతుండేవి.

"నీయమ్మ! రోజూ నీతో ఇదొక నసయిపోయింది. బాడుగ డబ్బులన్నీ నీ చేతుల్లోనే పడేస్తున్న గద. పిలకాయల్ని ఏంచేస్తావో చేసుకో. ఎద్దు ముడ్లో ఏలు పెట్టి

స్తవో, సూదిబొక్కలో దారమే గుచ్చిపిస్తవో, బలపాల్నే తినిపిస్తవో నీ ఇష్టం,'' అనేసి విసుగ్గా బా బీడీ ముట్టించే వాడు.

నిజంగా మా అమ్మ అలా వెంటబడకపోయి వుంటే ఇప్పుడు నాకీ ఉద్యోగం చేసే భాగ్యం ఉండి ఉండేది కాదు. అందరి సాయిబుల పిల్లల మాదిరి మిషను కుట్టుకుంటూనో, చెక్కబండి లాక్కుంటూనో ఉండేవాడిని. అందుకే మా అమ్మ, ''నేను లేకుండా ఉంటే నువ్వు కూడా మీ బాలాగే ఎద్దుబండి ఎక్కి ఛోఛో అంటూ ఉండేవాడివి,'' అంటుండేది. (మై నైతో తూభీ భైల్ కే గాండ్ మే ఉంగ్లీ రఖ్ కే ఛోఛో బోల్నేవాలా).

*

తిరిగి శవయాత్ర బయలుదేరింది.

''అషహదున్ లాఇలాహ ఇల్లల్లాహు మహమ్మదన్ రసూలిల్లా...'' కలమా చదువుకుంటూ బా కొరకు తవ్వి తయారుచేసిన ఖబర్‌ను చేరాం. బొందలో పండబెట్టినాం. బేఫికర్‌గా నిద్రిస్తున్నట్లుంది బా దేహం. మస్జిదు ఇమాం దువా చేశాక తలా గుప్పెడు మట్టి వేసి, రేగ్గాయ మండ తల దగ్గర మట్టిలో గుచ్చి ఊద్ బత్తీలు వెలిగించి ఎవరిండ్లకు వాళ్లు బయలుదేరారు.

చెరువుకట్ట మీదుగా నడుస్తున్న నాకు బా జ్ఞాపకాలే మనస్సంతా చోటు చేసుకున్నాయి.

*

బా ఉదయాన్నే బండి కట్టుకుని వెళ్లేవాడు. గునపానికి కట్టిన పగ్గం ఇప్పదీసి ఎద్దు వీపు మీద వేసి, బండి దగ్గరకు వచ్చి, నొగ ఎత్తి పట్టుకునేవాడు. బా వెనకనుంచి నంగనాచిలా వచ్చి కాడికింద మెడ వుంచేది ఎద్దు. మెడ పలుపు బిగించి కడచీలల్లో కుండల్లో కందెన వేసి ఎద్దును అదిలించేవాడు. నాలుకతో క్లెక్ క్లెక్ క్లెక్ క్లెక్ అని, వీపు మీద ఒకసారి చరిచి, చెండును ఒకసారి నిమిరాక కదిలేది.

మా ఊరు సంతనూతలపాడు. అది పట్టణమూ కాదు, పల్లే కాదు. చుట్టూ ఉండేది కూడా పల్లెటూళ్లే. అందుకని మా ఊరి సాయిబులు ఎక్కువమంది బాడుగ బండ్ల మీద బతుకుతున్నారు. మా బా బండి గుడిపాడు, గుమ్మలంపాడు, మద్దులూరు, బళ్లమూడి ఇంకా చాలా ఊర్లు తిరిగేది.

మనుషుల్ని ఎక్కించుకుని చీమకుర్తి, ఒంగోలు కూడా కొంతకాలం తిరిగింది. నాలుగైదుసార్లు రాత్రిళ్లు శవాన్ని వేసుకొనిపోయే బాడుగలు దొరికాయి. అలాంటి బాడుగలు కట్టటానికి చాలా ధైర్యం కావాలి. పొగాకు మొక్కల సీజనప్పుడు ఆ మూటలు వేసుకు పోయేవాడు. జాళ్లపాలెం, గుమ్మలంపాడు, రామతీర్థం, కుంటిగంగ తిరునాళ్లకు బండి కట్టేవాడు.

మా ఊర్లో బ్రాహ్మల కుటుంబాలు రెండో మూడో ఉన్నాయి. మా ఊరి చుట్టుపక్కల గ్రామాలకు పోయిగూడ సుబ్బయ్య కుటుంబంవారు మొయిన్లు తెచ్చుకునేవారు. ఈ బ్రాహ్మలను తీసుకపోయి తీసుకు వచ్చే పని మా దాదా, బా లు చేశారు. నెలకు నాలుగు, ఐదుసార్లు పోవాల్సి వచ్చేది. నెలకి బాడుగ బేడదర్న. మొయిన్లలో కొన్ని వస్తువులు కూడా ఇచ్చేవారు. ఏ బాడుగ దొరికితే ఆ బాడుగకు పోయేవాడు. ఒక్కోసారి దొరకవు. గురువారెడ్డిపాలెం బాడుగ దొరికాక వేరే ఊర్లకు పోలేదు. అప్పటి నుంచి పొద్దుపొడిచే ముందరే బజార్లోకి వచ్చేది బండి.

గ్రెందోల్ల కొట్లో, మద్దోల్ల కొట్లో, నీలిశెట్టోల్ల కొట్లో సరుకులు ఎత్తుకునేవాడు. ఒక్కడే బియ్యం బస్తాలు, నూనెడబ్బాలు ఇంకా చాలాచాలా కిరాణం సరుకుల మూటలు, అపరాల బస్తాలు వేసుకునేవాడు. వంద కిలోల బియ్యం మూటను వీపునేసుకుని జప్పున బండెనక నుంచి బండ్లోకి విసిరేసేవాడు. కాడి లేకుండా నన్ను మొగ మీద కూచోమనేవాడు. ఓ గంట సరుకులు ఎక్కించుకునే కార్యక్రమం నడిచేది. అంతసేపూ బండితో బాతో ఉండేవాడిని. నల్లంగా, దిట్టంగా చెమట్లు భూమ్మీద రాల్తుంటే బాహ్యస్పృహ లేకుండా యంత్రంలా చకచక కదుల్తుండేవాడు. చెడ్డీ మీద లోనికి బయటకు ఉర్కుతూ మహాధ్యానిలా అగుపించేవాడు.

నిండు బండిని నేరుగా తోలుకొచ్చి మా సందు మలుపు దగ్గర ఆపేవాడు. 'రేయ్! చూస్తా ఉండు,'' అని ఇంటికి పోయేవాడు. బా అన్నం తిని టిఫినీలో అన్నం తెచ్చుకునేదాక బండికి కాపలా ఉండేవాన్ని. బా నాస్తా కట్‌పాని కుండలో వేసుంచిన రాత్రన్నం. అంత బరువు ఎద్దెట్లా మోస్తుందా అని నేనే మోస్తున్నంత బాధ పడేవాడిని. కాకుల్ని ఎద్దు మీద వాలకుండా తరుము తుండేవాడిని. బా రావటం చూసి నేనే మంచినీళ్ల బావి దాకా బండి తోలేవాన్ని. 'హాయ్ హాయ్' అని తోకను గట్టిగా మెలిపెడితే కదిలేది. పగ్గం పట్టుకుని చెండు మీద నుంచి ఎడమకువేసి లాగితే ఎడమవైపు పోయేది. కుడివైపు లాగితే కుడికి పోయేది. వెనక్కు లాగితే ఆగేది. బండి తోల్తూ భలే ఖుషీ అయ్యేవాన్ని. అది చూసి మా బా, 'రేయ్! చదువుకొని నౌకరీ తెచ్చుకో. ఫాను కింద

పన్జేయొచ్చు. కూర్చొని తినొచ్చు. ఎద్దు బండి బతుకు దరిద్రం. ఉంటే తినాల. లేకుంటే పడుకోవాల,'' అనేవాడు.

నేను బండి దిగాక నా చేతిలో చిల్లర పైసలు పెట్టి, ''జత్తన్ జా,'' అని బండి తోలుకొని వెళ్లి పోయే వాడు.

గుర్రెడ్డిపాలెం కొట్లవాళ్లు, ఆసాములు బాతోనే వాడుకలా తెప్పించుకునేవాళ్లు. నూతలపాడు షావుకార్లు బా దోస్తులు. అప్పులు ఇప్పించేవాడు. ఎన్నో సర్దుబాట్లు చేసేవాడు. నమ్మకస్తుడు. నోట్లో నాలుకలాంటోడు. చాలాకాలం ఆ ఊరికి బండి తోలాడు. అందుకే బా దోస్తులు ఓ మాటనేవాళ్లు. 'గుర్రెడ్డిపాలెం డబ్బంతా జంగ్లీ తిన్నాడు. జంగ్లీ డబ్బంతా గుర్రెడ్డిపాలెం తిన్నది.' కట్టలు కట్టలు డబ్బులు లుంగీ బొడ్డు దగ్గర కట్టుకునే వాడు. ఎవరికెంత ఇవ్వాలిలాంటి లెక్కలు నోట్లో నోట్లో గంటలు గంటలు వేసుకుంటూ ఉండేవాడు.

ఒక దినం బా వెంట పోయాను. బస్తాల మీద బాషా మాదిరి కూర్చున్నాను. బండి ఊరు దాటాక గడ్డి వాసన, నీటిగాలి తగిలాయి. వరిచేలు ఒకవైపు, చెరువు కట్ట ఇంకోవైపు, మధ్య తార్రోడ్డు మీద బండి నడుస్తు న్నది.

అప్పుడు పొద్దును చూసి, ఇంకా ఎండ అంతగా షురూ కాకపోయేసరికి, ''హమ్మయ్య! ఎండ ఎక్కక ముందే గుర్రెడ్డిపాలెం చేరుకుంటాను. ఎండెక్కగానే రొప్పుతున్నది ఈ ముండమోపెద్దు. చల్లచల్లగా ఉండ గానే పాలెం చేరుకోవాలి,'' అనుకుంటూ నొగ మీద ఎగిరి కూర్చున్నాడు.

బియ్యం మూటలు, నూనెడబ్బాలు అంతా కలిపి ఆరేడు కింటాల్లుంటాయి. బరువు ఎక్కించిన అలసట తగ్గింది. బీడీ ముట్టించుకున్నాడు. తృప్తిగా కాలుస్తూ ఆలోచనల్లో పడ్డాడు. ఎవరెవరి దగ్గర ఏమేమి ఎక్కించుకున్నాడు, ఏవేవి ఎవరెవరి దగ్గర దించాలి, ఎంతెంత బాడుగ డబ్బులు వసూలు చేయాలి, మనసులో అనుకున్నాక నెమ్మదిపడ్డాడు. బండి సల్లా వాళ్ల బాయి దాటి మైనంపాడు మట్టిరోడ్డు ఎక్కింది. గతుకులు, గుంటలు రుద్రవరం దాకా ఎక్కువ. చూస్తూ జాగ్రత్తగా నడపాలి. అక్కడక్కడ దిగి బండిని బలంగా ముందుకు తొయ్యాలి. ఎద్దును గట్టిగా అరుస్తూ అదిలి స్తుండాలి. ఇదంతా చూసుకోకపోతే బండి ఇరుసన్నా ఇరుగుద్ది. చక్రాలు గుంటల్లో దిగబడి ఎద్దు కాలన్నా మడతబడి ముందుకి పడుద్ది. దాన్నిక లేపలేక చావాలి. నిండు బండి గతుకుల్లో గుంటల్లో తోలటం పెద్ద సర్కస్.

కష్టంగా చలపాలెం చేరుకుంది బండి. ఊరు సెంటర్లో రావిచెట్టు కిందున్న హోటల్ కొట్టు ముందు ఆపాడు. తనో టీ తాగి బీడీకట్ట కొనుక్కున్నాడు. నాకో రెండు నూగు జీడీలు కొనిచ్చాడు. చక్కరకేళీలు రెండు కొని ఎద్దు నోట్లో పెట్టాడు.

''సాయిబా! ఇంత కష్టంతో సంపాదించిన డబ్బుల్తో ఎద్దుకు చక్కెర కేళీలు, అరటిపండ్లు తిని పించేవాన్ని నిన్నే చూశాను. నువ్వో పిచ్చిమాలోకం లాగు న్నావే,'' అన్నాడు కొట్టోడు డబ్బులు తీసుకుంటూ.

''బండి లాగి బాడుగ సంపాయించి మాకు ఇంత కూడు పెట్టే మూగజీవమది. దాన్ని సరిగ్గా చూస్కోకుంటే దాని పేడ తిన్నట్టే,'' అని బండిని ముందుకు పోని చ్చాడు.

చలపాలెం నుంచి గురువారెడ్డిపాలెం దాకా బాటే లేదు. పొలాల్లో అడ్డంగా పడిపోవాలి. గట్లొచ్చినప్పుడు ఎక్కించలేక చావాలి. ఒక చేత్తో నొగని పట్టి ముందుకు తోస్తూ, ఇంకో చేత్తో చక్రం పట్టి లాగుతుండాలి. ఏ మాత్రం బాలన్సు తప్పినా, పట్టు సడలించినా బండి పడుద్ది. నరమానవుడు కనిపించడు. ఒక్కో గట్టును ఎక్కించి దింపుతుంటే ప్రాణం పోయి ప్రాణం వస్తుం టది. ఎద్దు కాళ్లకు, బా కాళ్లకు జీవితం మొత్తం సాష్టాంగం పడినా తీరని రుణం.

గురువారెడ్డిపాలెం చేరేసరికి ఎండ కొంచెం కొంచెం చురుక్కుమని తగుల్తోంది. కొట్లల్లో, దించా ల్సిన చోట్లల్లో లోడు దించేసి వేపచెట్ల కింద బండిని విడిచేసి ఎద్దును బండికి కట్టేశాడు. అనసూయమ్మింట్లో బకెట్టు తీసుకుని శెట్టికొట్లో అరకిలో బెల్లం కొని బకెట్లో వేసుకుని బావి నుంచి నీళ్లు తోడి బకెట్టు నిండా పోసి తీసుకొచ్చి ఎద్దుకు తాపుకున్నాడు. బండి కింద నుంచి ఎండుగడ్డి చొప్పొకటి తీసి ఎద్దు ముందు వేసి కిరాయి వసూళ్లకు ఊర్లోకి బయలుదేరాం.

పొద్దు నడినెత్తి ఎక్కాక ఇద్దరం వేపచెట్టు కింద సత్తు టిఫినులో అన్నం, దోసిత్తుల పచ్చడి, కాల్చిన ఎండుచేపలు తిన్నాం. నా కోసం పేవమ్మ హోటల్లో ప్లేటు పులిబంగరాలు తెచ్చాడు. జీవితం ఎట్ల నడిపిస్తే అట్ల బతికిండు బా. ఉన్నదున్నట్లు అనుభవించడమే తెలుసు. ఆలోచించటం తెలియని మనిషి. మస్జిదుకు ఏనాడు పోలేదు. బక్రీద్, రంజాన్లప్పుడు రెండుసార్లు ఈద్గాకు పోవటం తప్పించి.

*

బా జ్ఞాపకాలు గుక్క తిప్పుకోనివ్వడం లేదు. ఇంతలో మా అబ్బాయి నా దగ్గరకు వచ్చి కూర్చు న్నాడు.

"అబ్బా... అబ్బా... మీ బా ఎందుకు చదువు కోలేదు? చదువుకుంటే హైద్రాబాద్‌లో ఉద్యోగం వస్తది గద. మంచిగా హైటెక్కు బస్సుల్లో తిరగొచ్చు. అపార్టు మెంటుల్లో ఉండొచ్చుగద," చేతిని పట్టుకుని ఊపుతూ అడిగాడు. వాడికి చెప్పటానికి మా దాదాను యాద్ చేసుకోవాల్సి వచ్చింది.

మా దాదా పెద్దపుల్లు. ఆయన్దీ ఎద్దుబండే. బండి కట్టగానే మా బా రెడీ అయిపోయేవాడు. స్కూలుకు పోకుండా బండెనక పడిపోతూ ఉండేవాడు. మా దాదా తరిమేవాడు. దాక్కొని దాక్కొని పోయేవాడు. ఊరుదాటి చాలా దూరం వచ్చాక ఎవరో చెప్పేవారు. అప్పుడు ఇంకేమి చేయలేక దగ్గరకు పిలిచి బండి ఎక్కించుకునే వాడు. తర్వాత్తర్వాత అదే ఆయన జీవితం అయిపో యింది. దరిద్రంలో ఉన్న మనుషులకు చదువుండదు. అన్నం ఉండదు. ఆలోచించటం తెల్వదు. నా టైము వచ్చేటప్పటికి నన్ను చదివించటమే ఎంతో గొప్ప. ఎంతో కష్టమైంది. ఆయనేం చదువుతాడు... నా మాటలు వింటూనే నన్ను బొంకు దగ్గరకు తీసికెళ్లాడు.

"దస్ రుపే దో. దో థమ్సప్ హోనా," అన్నాడు. ఎండ వేడికి నాకూ దాహంగానే ఉంది. అయినా తాగ బుద్ధి కాలేదు. మావాడికి డబ్బులిచ్చి నేను ముందుకు కదిలాను. తిరిగి బా ఆలోచనలు ముసురుకున్నాయి.

*

మొదట్లో మా దాదానే కిరాయి మాట్లాడి బండి కట్టి పంపేవాడు. బాడిగ ఆయన వసూలు చేసుకునే వాడు. కొంతకాలం అలా సాగింది. తరువాత బాడుగ తెచ్చి మా దాది చేతిలో పడేసేవాడు. పెళ్లయ్యాక చాలా కాలందాక కూడా అదే జరిగింది. తరువాత మా 'మా'కు ఇచ్చేవాడు.

ఆయన జీవితకాలంలో ఎప్పుడూ కూడా డబ్బులు ఆయన దగ్గర ఉంచుకోలేదు. ఎద్దు బండి లాగుద్ది. మామూలప్పుడు పండిద్ది... బా బండి తోల్తాడు, మామూలప్పుడు కప్పు చూస్తా పంటడు.

"క్యాజీ... పైసలు ఏమన్నా కావాల్నా?" అని అడిగినప్పుడల్లా.

"నాకెందుకురా... నేనేం చేసుకునేది," అనేవాడు. అంతగా డబ్బుల్ని ఏం చేయాలో తెలియని మనిషిని ఇంకోతన్ని నేను చూడలేదు. మా దాదా జిందగీ అంతా ఒంటెద్దు బండే తోలాడు. వందేళ్లపాటు మా ఇల్లు బైల్ గాడి మీదే బతికింది. హమేషా ఒకటే పరిస్థితి. మా మాటల్లో చెప్పాలంటే గాడి అయ్‌తో చుల్ల సులగన (బండి కదిల్తేనే బువ్వ). మా సాయిబుల పాలెంలో సాయిబుల బండ్లు ఓ పద్దాక ఉండేవి. అందరి పరిస్థితి అదే. మా ఊర్లో బండోల్లు ఎక్కువగా సాయిబులు. వాళ్ల తరువాతే గొల్లోల్లు, వడ్డోల్లు. మాలోల్లు పచ్చిగడ్డి అమ్మేవాళ్లు.

మాకు వాడుక 'మాలసుబ్బిది.' సాయంత్రం ఆరు ఏడుకు ఒక మూట పచ్చిగడ్డి తెచ్చి పడేసేది. పచ్చిగడ్డి వాసన భలేగా ఉండేది. మూట విప్పంగానే ఇల్లంతా ఆ పరిమళం నిండిపోయేది. ఇక ఎద్దు దౌడు తీసుకుంటూ వచ్చి గడ్డిలో మోరపెట్టి తీయకపోయేది. నేను పిల్లబీసరకాయల కొరకు, పచ్చి చెనక్కాయల కొరకు, పచ్చికందికాయల కొరకు గడ్డంతా వెతు క్కుంటూ ఉండేవాన్ని. సుబ్బి నాకోసం దొంగతనంగా వాటిని కోసి గడ్డి మధ్యలో దాపెట్టి తెచ్చేది. అందరూ ఎడ్లకు ఒక గంప వేస్తే మా బా రెండు గంపలేసేవాడు. బెల్లం, నల్లబెల్లం, నూగుపిట్టు, కొబ్బరిపిట్టు, తౌడు, పచ్చిగడ్డిలకే సగం బాడుగ అయిపోయేది. ఇరుసు, బండి చక్రాలు చేసినందుకు, కాళ్లకు బిల్లలు కొట్టి నందుకు వడ్డోల్లకు, బండి గూడు అల్లినందుకు మేద రోల్లకు, చెర్నకోలలు చేసిచ్చినందుకు మాదిగోల్లకు మిగిలిన బాడుగ అయిపోయేది.

దరిద్రం మా దాదాల నుంచే ఉంది. బా చిన్న గున్నప్పుడు తినటానికి గింజల్లేక రేగడి మట్టిలో పెరుగు కలుపుకుని తిని బతికారు. మా దాదా పనికొరకు ఇరవై మైళ్ల దూరం పొదిలి పోయొచ్చేవాడు. బా మాత్రం మా ఊరొదిలి ఎక్కడికీ పోయేవాడు కాడు. కుర్రప్పుడెప్పుడో గుర్రాన్ని తెచ్చుకోవటానికి ఒకసారి షోలాపూర్ పోయాడు. ఎద్దుల కొరకు దక్షిణాది పోయేవాడు. దగదర్తి దగ్గర వెలుపోడులో కొని కావలి మీదుగా ఆగి ఆగి తోలుకొని రావటానికి రెండుమూడు రోజులు పట్టేది. హుషారుగున్నప్పుడు దోస్తుల్తో రెండు విషయాలు చెప్పేవాడు.

"నా షాది ఒక దినం రెండు దినాలు గాదు వారంరోజులు జరిగింది. దక్షిణాది నుంచి ఆట గుర్రం తెప్పించాం. ఎట్లుందనుకున్నావ్! ఒంటె మాదిరుంది. సారా పోపించి రెండు మూడు రాత్రుల్లు ఎగిరిపిచ్చి నాం." ఇది చెప్పాక కండ్లు కొంచెం నుదురుపైకి చేరేవి.

కొంచెం పొంగిన గుండెను ఇంకొంచెం పొంగించి రెండో విషయం చెప్పేవాడు.

''బండ్ల సాయిబుల్లో కాని, మిషను సాయిబుల్లో కాని, హోల్ మొత్తంగా సాయిబుల పాలెంలో ఏ సాయిబూ తన కొడుకుల్ని చదివించలేకపోయారు. ఈ జంగ్లీ ఒక్కడు తప్పించి. అదీ మామూలు చదువా! బియ్యే చదివి నౌకరీ చేస్తున్నాడు.''

*

ఇంటికి చేరేసరికి ఎవరి దుఃఖంలో వాళ్లున్నారు. మట్టికొచ్చిన బంధువులు, స్నేహితులు చెప్పకుండా, ఇంటికి రాకుండా వెళ్లిపోయారు. రాత్రయ్యాక ఎవరో అన్నం, కూరలు తెచ్చి ఇంట్లో పెట్టిపోయారు. కంచంలో అన్నం పెట్టుకుని నా కొడుకు నా దగ్గర కూర్చొని తింటున్నాడు. బండి గురించి బా గురించి ఏమన్నా చెప్పమని అడిగాడు. వాడితో పడుకునే చెప్పసాగాను.

''ఒక్కోసారి రాత్రిపూట ఎప్పుడో బండొచ్చేది. వచ్చేప్పుడు పల్లిచేన్ల నుంచి పది ఇరవై చెనక్కాయ చెట్లు పీక్కొచ్చేవాడు బా. గుత్తులు గుత్తులు కాయ లుండేవి. ఎండు వరిగడ్డి మా ఇంట్లో ఎప్పుడూ మోపులు మోపులుండేది. ఎండుగడ్డిలో మంటపెట్టి చెట్లు అందులో వేసేవాడు. సగం కాలినాక మమ్మల్ని లేపేవాడు. మా వద్దని తిడుతున్నా లేపేవాడు. పిల్లలం మంట చుట్టూ కూచుని చలిమంటలా కాచుకుంటూ చనక్కాయలు వేడివేడిగా తినేవాళ్లం. రుచి రుచిగా వేడి వేడిగా తింటున్న మమ్మల్ని మురిపెంగా చూస్తూ వాటితోపాటు తినమని బెల్లం పెట్టేవాడు. ఎండుగడ్డిలో కాల్చిన పచ్చి చెనక్కాయ రుచి భలేగుంటది. సజ్జలు పండే కాలంలో సజ్జబూరెలు చేపించేవాడు. మేము వండినవి వండినట్టు తినేస్తామని మా, దాదీ అర్ధరాతిరి చేసేవాళ్లు. బా మా పిర్రలు గిల్లి వాళ్లకు, మాకు తెలియ కుండానే నిద్ర నుంచి లేపేవాడు. మెలకువ రాగానే సజ్జ బూరెల వాసనకు పొయ్యి మీది బాండి చుట్టూ చేరి తినటం మొదలెట్టేవాళ్లం. రుచిరుచిగా వేడివేడిగా తింటున్న మమ్మల్ని మురిపెంగా చూసుకునేవాడు. అప్పుడప్పుడు చావబోయే పొట్టేళ్లను కొనుక్కొచ్చి కోసే వాళ్లు. మా ఊళ్లో మేకపోతుల్ని, గొర్రెల్ని కోసేవాళ్లు. పొట్టేలు మాంసం కన్నా వాటి మాంసం సలీసుగా వుండేది. నాలుగైదు కుప్పలు తెచ్చి వండించేవాడు. బాకు మాంసం, చేపలు బాగా ఇష్టం. ఆ రోజంతా మాంసం తింటుండేవాళ్లం. అప్పుడు కూడా మురిపెంగా చూసుకునేవాడు. ఇంకా పిల్లిపెసర, పచ్చి కంది కాయలు, చింతకాయలు, అత్తికాయలు ఎన్నెన్నో బండి నుంచి వచ్చేటప్పుడు చేన్ల నుంచి, చెట్ల నుంచి కోసుకొచ్చేవాడు. హిందూ పండగలప్పుడు వాళ్లిచ్చే అరిసెలు, మణుబూలు, సలిపిండి, బూంది తెచ్చే వాడు. మేం తింటే ఆయనకు భలే సంబరం. ఇలా చాలా విషయాలు చెప్పాను. కుతూహలంగా అన్నీ విని నిద్రొస్తుందని లేచి వెళ్లి పక్క మంచం మీద పడు కున్నాడు. నేను కూడా పడుకుందామని కళ్లు మూసు కున్నాను. నిద్ర రాలేదు. ఆలోచనలు ఆగలేదు.

*

బాబ్రీ మస్జిదు కూలినట్లుగా అదే సంవత్సరం మా బండి ఇరుసు ఇరిగి బండి కూడా కుప్పకూలింది. గురువారెడ్డిపాలెంకు ఎర్రబస్సు రాకపోకలు పెరిగి జనం సరుకులు బస్సుల్లోనే తెచ్చుకోసాగారు. బండోళ్లతో సరుకులు తెప్పించడం మానేశారు. అందుకని బా ఇరుసు బాగు చేయించుకోలేదు. ఆజాది వచ్చిన నాటి నుంచి షురూ అయిన బండి తోలే పని అప్పటితో ముగిసింది.

బా దోస్తులు కూడా కుడిఎడంగా అదే కాలంలో వదిలేశారు. ఎండకు ఎండి వానకు తడిసి పిల్లలు ఎగిరి బండి గుల్లగుల్లయిపోయింది. బండిగూడు, చక్రాలు, కుండలు, చక్రాల ఆకులు, నొగ, కాడి అన్నీ అప్పు డొకటీ అప్పుడొకటీ మంటల్లో వేసి మా కాల్చి వంట చేసేసింది. మా పెద్ద చెల్లి పెద్దాపరేషను ఖర్చు నిమిత్తం ఎద్దును అమ్మేశాడు బా.

జట్కా బండ్ల నుంచి ఎద్దు బండ్లు తోలటం, దూదేకటం నుంచి మిషన్లు కుట్టడం పూర్వుల నుంచి వారసత్వంగా వచ్చిన సాయిబుల వృత్తులు. ఆ పనులు ఆ సమయానికి దేనికీ పనికిరాకుండా పోయాయి. అప్పటినుంచి ఈ పదేళ్లు ఊర్లోనే చక్కబండి లాగేవాడు. నూనెడబ్బాలు, చిన్నచిన్న మూటలు ఒక కొట్టు నుంచి ఇంకో కొట్టుకి వేసేవాడు.

హల్కా, ఖర్చు తక్కువ గుర్రబ్బండి నుంచి- భారం, ఖర్చెక్కువ ఎద్దుబండి నుంచి- తనే ఓ ఎద్దులా లాగే చక్కబండి దాకా బా జిందగి. కంప్యూటర్లు, హైటెక్కులు తెలవ్వు. పాకిస్తాన్, అయోధ్య, గుజరాత్‌లు తన జీవితకాలంలో జరిగినప్పటికీ తెలవ్వు.

''అలా జరిగిపోతాడని ఎవరం ఊహించలేదు. గుండెనొప్పిగుందని చెక్కరిక్షా మీదే పడుకున్నాడు అంతే,'' అన్నయ్య ఎవరికో చెప్తున్నాడు. ఏడ్చీ ఏడ్చీ ఏడ్చే శక్తి లేక ఏడుపాగక మా ఏడుస్తనే ఉంది. ఇంతదాకా

నాకు ఏడుపే రాలేదు. మనసంతా ఒకలాంటి శూన్యంతో నిండిపోయి ఉన్నది. ఏడ్చేస్తే, సహజంగా ఏడుపొచ్చేస్తే హాయిగా ఉంటుంది.

మూడోరోజు ఉదయాన్నే మస్జిదు మనుషులు, మా అన్నదమ్ములం బా ఖబర్‌కు పోయాం. బొంగులు, పుట్నాలు, కొబ్బరిముక్కలు, బెల్లం కలిపిన పొట్లం అక్కడ ఉంచి దువా చేశారు. తలా కొంచెం తిని,

"ముసల్మాన్‌కో హమేశాకేలియే ఘర్, యే ఖబర్. మంచిగా అలికి నిదానంగా ఇంటికి చేరండి."

ఈ మాటలు చెప్పి అందరూ ఇండ్లకు వెళ్లిపోయారు. మా అన్నదమ్ములం మిగిలాం. నీళ్లు కలుపుతూ మట్టిని మెత్తగా చేస్తూ శుభ్రంగా అలికి రెండు స్టెప్పులుగా దర్గాలా తయారుచేసి ఇంటికి బయలుదేరాం. కొంచెం దూరం వచ్చాక ఏదో బాధ, ఉద్వేగం కలిగాయి. బీడీ లేకుండా గంటన్నా బా ఉండలేడు. అన్నయ్య దగ్గర తీసుకొని వెనక్కుపోయి బావుట బీడీ కట్టొకటీ, అగ్గిపెట్టొకటి ఖబర్ మీదుంచి వచ్చేశా.

దస్మా అయినాక, చాలిస్మాకు వస్తామని చెప్పి ఇంటి నుంచి బస్టాపుకు వచ్చాం. ఊర్లో ఎప్పుడు దిగినా కొద్దిదూరం నడవగానే బా ఎదురొచ్చేవాడు. అరుగుల మీద మా కోసమే కాచుకుని ఉండేవాడు. వొళ్లంతా ప్రేమ నింపుకుని సూట్‌కేస్ అందుకునేవాడు. పోయేప్పుడూ అంతే. మా బస్సు కనుమరుగయ్యే దాకా మమ్మల్ని చూస్తనే ఉండేవాడు. ఆయన్ని చూస్తే చాలు, మనసంతా ద్రవించిపోయేది. కొండంత అమాయక ప్రేమ పంచిన బా మరణించలేడు.

*హమారీ దిల్‌కే ఖబర్ మే*
*బా కి ప్యార్ దరియా జైసె*

***ఆదివారం ఆంధ్రజ్యోతి, 21 సెప్టెంబర్ 2003***